
సాక్షి విశాఖపట్నం


బుధవారం ı 12 ı మార్చి ı 2025



వీఎంఆర్డీఏ పార్కుకు నూతన శోభ 8లో



సరికొత్త హంగులతో వైఎస్సార్ స్టేడియం 8లో



ఇఫ్తార్	సహర్
బుధ	గురు
6.09	4.52

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నలుగురు సీఐల బదిలీ



విశాఖ సిటీ : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. భీమిలి సీఐ సుధాకర్‌ను విశాఖ రేంజ్‌కు సరెండర్ చేయగా.. ఆయన స్థానంలో టూటౌన్ లాండ్ ఆర్డర్ సీఐ బి.తిరుమలరావును నియమించారు. అలాగే త్రీటౌన్ సీఐ రమణయ్యను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు. అతని స్థానంలో సిటీ స్పెషల్ బ్రాంచ్–1లో విధులు నిర్వర్తిస్తున్న పి.పైడయ్యను నియమించారు.

జూలో వన్యప్రాణులకు బర్డ్ ఫ్లూ దెబ్బ



జూలో పాముల ఎన్‌క్లోజర్

ఆరిలోవ: బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రభావం జూలో వన్యప్రాణులపై పడింది. రోజూ చికెన్ తినే జంతువులు, పాములకు సుమారు నెల రోజులకు పైగా ఆహారం మారిపోయింది. చికెన్ రుచి తగలకపోవడంతో పాపం వన్యప్రాణులు వేరే రుచికి అలవాటుపడేందుకు ఇబ్బంది పడుతున్నాయి. ఇక్కడ పులులు, సింహాలు, హైనాలు, చిరుతలు తదితర వాటికి బీఫ్‌తో పాటు చికెన్ కూడా రోజూ ఆహారంగా వేస్తారు. పాములకు కోడి పిల్లల్ని అందిస్తారు. బర్డ్ ఫ్లూ వల్ల సీజెడ్‌ఏ అధికారుల ఆదేశాలతో వన్యప్రాణుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ ఆహారం అందిస్తున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఆయా జంతువులకు చికెన్‌కు బదులుగా ప్రస్తుతం పంది మాంసం(పోర్క్), పాములకు కోడి పిల్లలకు బదులుగా కుందేళ్ల పిల్లలు(చిన్నవి) ఆహారంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.


రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: బీసీ, ఈబీసీ, కాపు, బ్రాహ్మణ, కమ్మ, ఆర్యవైశ్య తదితర కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. అర్హులైన వారు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. https://apobmms.apcfss.in/ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. స్వయం ఉపాధికి కావాల్సిన రుణాలను దరఖాస్తుదారులకు మంజూరు చేస్తామని ఆ శాఖ వెల్లడించింది.

స్థలాలు కోల్పోయిన వారు దరఖాస్తు చేసుకోండి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారు టీడీఆర్ పోర్టల్‌లో సిటిజన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు ఒక ప్రకటనలో సూచించారు. యూజర్ వాలిడేషన్ కోసం ఆధార్ కాపీ, యూజర్ రిజిస్ట్రేషన్ ఫారంతో దరఖాస్తు అందజేయాలన్నారు. యూజర్ వాలిడేషన్ పూర్తయిన తర్వాత రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయిన వారి పూర్తి యాజమాన్య హక్కు వివరాలు టీడీఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఆ తర్వాత నిబంధనల మేరకు దరఖాస్తును పరిశీలించి, టీడీఆర్ ఇచ్చే విషయంపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మరింత సమాచారం కోసం సంబంధిత జోనల్ కార్యాలయాల్లో ఏసీపీలను, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ సిటీ ప్లానర్‌ను సంప్రదించవచ్చు.

16 నుంచి హోలీ స్పెషల్ రైళ్లు



తాటిచెట్లపాలెం: హోలీ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖ–పాట్నా–విశాఖ మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ మంగళవారం ప్రకటనలో తెలిపారు.

- విశాఖపట్నం–పాట్నా(08537) హోలీ స్పెషల్ ఈ నెల 16, 23, 30 తేదీ(ఆదివారా)ల్లో విశాఖలో రాత్రి 7.30కు బయల్దేరి మరుసటి రోజు(సోమవారా)ల్లో రాత్రి 9 గంటలకు పాట్నా చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో పాట్నా–విశాఖపట్నం(08538) హోలీ స్పెషల్ 17, 24, 31 తేదీ(సోమవారా)ల్లో రాత్రి 10.30కు పాట్నాలో బయల్దేరి బుధవారం తెల్లవారుజాము 3.50కు విశాఖ చేరుకుంటాయి. ఈ స్పెషల్ రైళ్లు 3 సెకండ్ ఏసీ, 4 థర్డ్ ఏసీ ఎకానమీ, 7 స్లీపర్ క్లాస్, 4 జనరల్ సెకండ్ క్లాస్, 1 సెకండ్ క్లాస్ కం లగేజీ కం దివ్యాంగ కోచ్, 1 జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తాయి.

భవిత కోసం యువత పోరు



సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల చెల్లింపులపై మీనమేషాలు లెక్కిస్తూ వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది. కొన్ని త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు కళాశాలల నుంచి విద్యార్థులను వెల్లగొట్టడం, పరీక్షల సమయాల్లో హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం చేస్తున్నాయి. దీంతో పేదింటి తల్లిదండ్రులు ఇళ్లు, పొలాలు, పుస్తెలు తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చి ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా యువత కూడా కూటమి ప్రభుత్వం చేతిలో మరోసారి మోసపోయింది. ఏటా జాబ్ క్యాలెండర్ ఇచ్చి మొత్తం 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడంలేదు. మెగా డీఎస్సీ దగా అయిపోయింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల సహా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుబాట పట్టిస్తోంది. సచివాలయ ఉద్యోగులను అనిశ్చితి పరిస్థితుల్లోకి నెట్టేసింది. రూ.5వేలు కాదు రూ.10 వేలు ఇస్తామని వలంటీర్లలో ఆశలు కల్పించి తీరా అధికారంలోకి వచ్చాక వారిని రోడ్డున పడేసింది. ఇక నిరుద్యోగ భృతి హామీ కూడా టీడీపీ 2014–19 పాలనలో మాదిరిగానే ఎగనామం పెట్టేసింది. ఈ హామీలను అమలుచేయాలని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు మంగళవారం వైఎస్సార్ సీపీ 'యువత పోరు' బాట పడుతోంది.

- నిరుద్యోగ భృతి ఊసే లేదు.. జాబ్ క్యాలెండర్ జాడ లేదు
- పిల్లల ఫీజులకు పైసా విదల్చలేదు..
- ఎంఎస్‌ఎంఈలు రాకపోవడంతో చిన్న ఉద్యోగాలకూ దిక్కులేదు
- చంద్రబాబును నమ్మి మరోసారి దగాపడ్డ యువత

జిల్లాలో నిరుద్యోగుల సంఖ్య	4.5 లక్షలు
కొత్తగా వచ్చిన పరిశ్రమలు	0
రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు	42 వేలు

భృతి భూటకమేనా..!

జిల్లాలో 6,39,699 కుటుంబాల్లో దాదాపుగా 4.5 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నట్లు అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సగటున ప్రతీ నెలా నిరుద్యోగ భృతి కింద ప్రభుత్వం రూ.135 కోట్లు చెల్లించాల్సింది. 9 నెలల కూటమి పాలనలో రూ.1215 కోట్లు నిరుద్యోగులకు బకాయిపడింది.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.35 కోట్లు

- 2023–24 విద్యా సంవత్సరంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 38,017 మంది బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.29.87 కోట్లు విడుదల చేసింది.
- 2023–24 విద్యా సంవత్సరంలో 3,929 ఎస్సీ విద్యార్థులకు రూ.4.74 కోట్లు మంజూరు చేసింది.
- జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరంలో 42 వేల మందికిపైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ తదితర కోర్సులు చదువుతున్నారు. వీరికి ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. మొత్తం రూ.35 కోట్లు బకాయిలు ఉన్నాయి.

ప్రైవేట్ కళాశాలలు వేధింపులు

విశాఖలో పలు ప్రైవేట్ ఇంజినీరింగ్, పీజీ కళాశాలలు విద్యార్థులను ఫీజు చెల్లించాలని వేధింపులకు పాల్పడుతున్నాయి. తరగతి గది నుంచి బయటకు పంపించేయడం, పరీక్షల సమయంలో హాల్ టికెట్లు ఇవ్వకపోవడం వంటి ఘటన చోటుచేసుకున్నాయి. విశాఖలో కూటమి ఎంపీకి చెందిన ఓ కళాశాలలో ఫీజులు చెల్లించకపోతే హాల్ టికెట్లు ఇవ్వబోమని బెదిరించగా విద్యార్థులు ఎదురుతిరిగారు. కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులే ఈ విధంగా ప్రవర్తించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'యువత పోరు'



'యువత పోరు' భాగంగా ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో పాదయాత్రగా కలెక్టరేట్ వరకు వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు హాజరుకానున్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం..



విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, ఎన్నికల ముందు చెప్పిన విధంగా నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. కొత్త మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తూ పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడాన్ని నిరసిస్తున్నాం. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ 'యువత పోరు' నిర్వహిస్తున్నాం. జిల్లాలోని విద్యార్థుల తల్లిదండ్రులు, నిరుద్యోగులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు హాజరై ఈ పోరుబాటను విజయవంతం చేయాలి.

– గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

వైఎస్సార్‌సీపీ హయాంలో ఉద్యోగాల కల్పన

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలోని సచివాలయాల్లో 4,700 శాశ్వత ఉద్యోగాలు, 9,800 వలంటీర్లను నియమించింది. వైద్యారోగ్య శాఖలో వైద్యులు, పారామెడికల్, ఇతర ఉద్యోగాలు 8,500కుపైగా భర్తీ చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ద్వారా 43,074 మందికి ఉద్యోగాలు కల్పించింది. 2019–20లో 4,001 యూనిట్లు ఏర్పాటు చేసి 8,091 ఉద్యోగాలు, 2020–2021లో 4,450 యూనిట్లు ఏర్పాటు 15,100 మందికి ఉద్యోగాలు, 2022–23లో 4276 యూనిట్లు ఏర్పాటుచేసి 16,145 మందికి ఉద్యోగాలు, 2023–24లో 2414యూనిట్లను ఏర్పాటుచేసి 13,173 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది.

మెడికల్ కాలేజీ ప్రైవేట్ పరం



మాకవరపాలెంలో గల నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల

ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికే 5 కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. మిగిలిన మెడికల్ కళాశాలలు సగానికి పైగా నిర్మాణపనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేయడానికి యత్నిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాకు రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. వీటిలో పాడేరు మెడికల్ కళాశాల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పూర్తి కాగా.. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం భీమబోయిన పాలెంలో సగానికిపైగా నిర్మాణం జరిగింది. ఈ దశలో వచ్చిన కూటమి ప్రభుత్వం రూ.500 కోట్లతో నిర్మిస్తున్న కళాశాలను ప్రైవేట్ చేతులకు అప్పగించే కుట్రలకు పాల్పడుతోంది. ఇది అందుబాటులోకి వస్తే ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో విద్యార్థులకు ప్రవేశం లభించేది. తర్వాత పీజీ వైద్య కోర్సులు వచ్చేవి. బోధన కోసం 500 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చేది. కానీ ఇప్పుడది కలగా మిగిలింది.

విద్యారంగంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



ఏయూ ముందు ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న నాయకులు

- తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- నేటి 'యువత పోరు' విజయవంతానికి వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం పిలుపు

విశాఖ విద్య: విద్యారంగంపై కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం స్టేట్ అడ్వైజర్ బోరుగడ్డ మోహన్ బాబు, రాష్ట్ర కార్యదర్శి తెడబారిక సురేష్‌కుమార్, విశాఖ జిల్లా అధ్యక్షుడు పులగం కొండారెడ్డి అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం చేపట్టనున్న 'యువత పోరు'ను విజయవంతం చేయాలని మంగళవారం ఆంధ్ర యూనివర్సిటీ ప్రధాన గేటు ముందు పోస్టర్లు ఆవిష్కరించారు. విద్యారంగాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో అమలులో విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులకు చదువులు భారమవుతున్నాయన్నారు. నిరుపేద విద్యార్థులను చదువులకు దూరం చేసి, తద్వారా ప్రైవేట్ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మండిపడ్డారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులు, యువతను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై అందరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శెట్టి సుబ్రహ్మణ్యం, సాగర్, అజయ్ కుమార్, రోహిత్, ఖాసీం, పిల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రేవిడి జట్లమ్మకు అరిసెలతో అలంకరణ

తగరపువలస: పద్మనాభం మండలం రేవిడి జట్లమ్మ అమ్మవారిని మంగళవారం అక్కడి ఆలయ కమిటీ ప్రతినిధులు అరిసెలు, సున్నిపాకుండలు, పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. మరగడ నాగ, కుమారి, ఇషితరెడ్డి ఈ అలంకరణకు సహాయ సహకారాలు అందించారు. అలాగే భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు కొబ్బరికాయలు, పువ్వులతో అలంకరించారు. గ్రామానికి చెందిన నీలాపు సూర్యనారాయణ, అనసూయ దంపతులు ఈ అలంకరణకు సహాయ సహకారాలు అందించగా.. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు అందించారు.



అరిసెలు, సున్నిపాకుండల అలంకరణలో రేవిడి జట్లమ్మతల్లి



కొబ్బరికాయల అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు

డిగ్రీ ప్రవేశాలు



- అఫిలియేషన్ గ్రీన్ సిగ్నల్ రాకముందే అడ్మిషన్ల వేట
- ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో తనిఖీలు శూన్యం
- ఇతర రాష్ట్రాల బోర్డు సర్టిఫికెట్లకు జెన్యూనిటీ ఎంత?
- కాలేజీల నిర్వహణపై దృష్టి పెట్టని ఏయూ

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిర్వాహకులు అప్పుడే అడ్మిషన్ల వేట మొదలుపెట్టారు. 'మా కళాశాలలో చేరితే ఫీజు రాయితీ, ప్లేస్‌మెంట్ గ్యారెంటీ' అంటూ ఆకర్షణీయమైన బ్రోచర్లను చేతుల్లో పెట్టి విద్యార్థులకు వల వేస్తున్నారు. విశాఖ నగరంలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద ఎక్కడ చూసినా ఈ హడావిడి కనిపిస్తోంది. ఉన్నత విద్యా మండలి గ్రీన్ సిగ్నల్ ఇవ్వకముందే 2025–26 విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లు చేస్తుండటం గమనార్హం. దీని వెనుక కూటమి ప్రభుత్వంలోని పెద్దలతో అంటకాగే ఆంధ్ర యూనివర్సిటీలోని కొంతమంది అధికారుల ప్రమేయం ఉందనే ప్రచారం సాగుతోంది. వర్సిటీ నుంచి అఫిలియేషన్ వచ్చేలా తాము చూసుకుంటామని భరోసా ఇస్తుండటంతోనే ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు అడ్డదారులు తొక్కుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఏటా 25 వేల మందికి పైగానే డిగ్రీలో చేరిక

ఆంధ్ర యూనివర్సిటీ అఫిలియేషన్‌తో ఉమ్మడి విశాఖ జిల్లాలో 196 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. 38 కళాశాలల్లో డిగ్రీ, పీజీ కోర్సులు కలిపి ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. వీటిలో ఏటా డిగ్రీ మొదటి సంవత్సరంలో 25 వేల మందికి పైగానే విద్యార్థులు చేరుతుంటారు. ఈ కళాశాలల నిర్వహణకు ఏటా ఆంధ్ర యూనివర్సిటీ అఫిలియేషన్ (గుర్తింపు) ఇవ్వాల్సి ఉంటుంది. ఉన్నత విద్యా మండలి ఆన్‌లైన్ ప్రవేశాల వెబ్‌సైట్‌లో వర్సిటీ అఫిలియేషన్ పొందిన కళాశాలల జాబితానే పెడతారు.

ఇతర రాష్ట్రాల బోర్డు సర్టిఫికెట్లపై పరిశీలన నిల్

ఉద్యోగ, ఉపాధి, వ్యాపార పరమైన వ్యవహారాలతో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు నగరంలో స్థిరపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇంటర్మీడియట్ స్థాయిలో ఇతర రాష్ట్రాలకు చెందిన బోర్డులు జారీ చేసే సర్టిఫికెట్లతో ఇక్కడ డిగ్రీలో ప్రవేశాలు పొందుతున్నారు. అయితే వీటిలో జెన్యూనిటీ ఎంత అనేది పరిశీలన లేకపోవడంతో కొన్ని కళాశాలల్లో నకిలీ సర్టిఫికెట్లతో డిగ్రీ అడ్మిషన్లు పొందుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ద్వారకానగర్‌లోని ఓ డిగ్రీ కళాశాలలో ఇలాంటివి వెలుగులోకి వచ్చినప్పటికీ కళాశాల యాజమాన్యం వీటిని తొక్కిపెట్టినట్లు తెలుస్తోంది. యూనివర్సిటీ అధికారులు ఇలాంటి వాటితో తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తుండటంతో కొంతమంది ఏజెంట్లు ఇతర రాష్ట్రాల బోర్డుల్లో ఓపెన్ విధానంలో చదివినట్లు విద్యార్థులకు నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రైవేట్ కళాశాలలపై తనిఖీలేవీ.?

ప్రైవేట్ కళాశాలల నిర్వహణకు అనువైన భవనాలు, తరగతి గదులు, అర్హత గల అధ్యాపకులు, ఆటస్థలం, లైబ్రరీ, సైన్స్ ప్రయోగశాలలు, పార్కింగ్ ప్రదేశం ఉండాలి. పోలీసు, జీవీఎంసీ, అగ్నిమాపక శాఖల నుంచి పొందిన ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఇవన్నీ క్షేత్రస్థాయిలో సవ్యంగా ఉన్నాయా లేదా అనేది వర్సిటీ నుంచి వెళ్లే బృందం తనిఖీ చేసి నిజనిర్ధారణ నివేదిక ఇచ్చిన తర్వాతనే అఫిలియేషన్ జారీ అవుతుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని వర్సిటీలోని కాలేజీ డెవలప్‌మెంట్ కమిటీ (సీడీసీ) పర్యవేక్షిస్తుంది. అయితే కళాశాలల తనిఖీలు సవ్యంగా జరగడం లేదు. దీంతో నగరంలోని కొన్ని కళాశాలల్లో కనీస వసతులు, అర్హత గల అధ్యాపకులు లేకుండానే చదువులు సాగుతున్నాయి.

అఫిలియేషన్ ఇవ్వడమే మా పని



ప్రైవేట్ కాలేజీల నిర్వహణకు అఫిలియేషన్ ఇవ్వడమే యూనివర్సిటీ పని. మిగతా వ్యవహారాలన్నీ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో జరుగుతుంది. డిగ్రీలో చేరే విద్యార్థులు సమర్పించే సర్టిఫికెట్లు జెన్యూనిటీ పరిశీలన కూడా కాలేజీల వారే చూసుకోవాలి.

– ఆచార్య టి.వి.కృష్ణ, ఆంధ్రా యూనివర్సిటీ సీడీసీ డీన్

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె చర్చలు అసంపూర్ణం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై రీజనల్ లేబర్ కమిషనర్(ఆర్‌ఎల్‌సీ) మొహంతి సమక్షంలో జరిపిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె నోటీసుపై ఆర్‌ఎల్‌సీ మంగళవారం ఉక్కు యాజమాన్యం, కాంట్రాక్టర్ల అసోసియేషన్, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమైంది. కార్మికుల తొలగింపుపై కమిటీ వేస్తామని యాజమాన్యం ప్రతినిధులు తెలపగా పోరాటం కొనసాగిస్తామని కార్మిక సంఘాలు తేల్చి చెప్పాయి. కార్మిక నాయకులు అందించిన వివరాలు..

తొలగింపు అంశాన్ని కార్మిక సంఘాలు ప్రస్తావించగా, కంపెనీ పరిస్థితుల దృష్ట్యా సిబ్బంది తగ్గింపు చేపట్టామని యాజమాన్యం తెలిపింది. సుదీర్ఘంగా జరిగిన చర్చల్లో ఇటీవల బయోమెట్రిక్ నుంచి తొలగించిన 248 కాంట్రాక్ట్ కార్మికులను పునరుద్దరించాలని యాజమాన్యానికి ఆర్‌ఎల్‌సీ సూచించారు. పర్మినెంట్ కార్మికుల వలే కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు నచ్చినట్లు చేయకూడదన్నారు. దీనిపై కమిటీ ఏర్పాటు చేస్తామని యాజమాన్యం ప్రతినిధులు తెలిపారు. కార్మికుల తొలగింపు పూర్తి నిలుపుదలపై యాజమాన్యం హామీ ఇవ్వకపోవడంతో తమ పోరాటం కొనసాగుతుందని కార్మిక సంఘాల నాయకులు ఆర్‌ఎల్‌సీకు రాతపూర్వకంగా తెలిపారు. సమావేశంలో యాజమాన్యం తరపున జీఎం ఎం.మధుసూదనరావు, ఖర్, వైహెచ్ శంకర్, వివిధ కార్మిక సంఘాల నాయకులు కె.ఎం.శ్రీనివాస్, జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, మంత్రి రవి, కె.వంశీకృష్ణ, జి.సత్యారావు, టి.గుర్నాథ్, జి.అప్పన్న, యు.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రీజనల్ లేబర్ కమిషనర్ మొహంతికి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

విశాఖ లీగల్: హత్యా నేరం రుజువు కావడంతో ఓ వ్యక్తికి జీవత ఖైదు విధిస్తూ నగరంలోని రెండవ అదనపు ప్రధాన జిల్లా కోర్టు న్యాయమూర్తి సి.కె. గాయత్రి మంగళవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.3 లక్షలు జరిమానా కూడా చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలివి.. పైడి రమేష్ కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బర్మా క్యాంప్ దగ్గర ఇందిరానగర్‌లో నివాసం ఉండేవాడు. వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. నిందితుడు కొండవీటి శివతో రమేష్‌కు పరిచయం ఉంది. 2021 ఆగస్టు 11న రమేష్, శివ గొడవపడ్డారు. స్వల్ప వివాదంతో శివ, రమేష్‌పై చేతులతో పిడి గుద్దులు కురిపించాడు. అక్కడితో ఆగకుండా సమీపంలోని ఒక కర్ర తీసుకొని రమేష్ తలపై బలంగా గాయపరిచాడు. తీవ్ర గాయాల మధ్య రమేష్ తన భార్య భారతికి ఫోన్ చేసి, 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కి వెళ్లాడు. రెండు రోజులపాటు చికిత్స పొంది ఆగస్టు 13న మృతి చెందాడు. కంచరపాలెం పోలీసులు నిందితుడిపై 302 కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు. నిందితుడు శివపై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో 21 కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

ధైన్యం.. జూలో మూగ జీవాల వైద్యం

- ఇటీవల పుట్టిన రెండు సింహం పిల్లలు మృతి
- వారాల తరబడి పోటీ పడి మరీ సెలవుల్లో వైద్యులు


జూ పార్కు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో మూగ జీవాలకు వైద్యం ప్రశ్నార్థకంగా మారింది. వైద్యులు వారాల తరబడి పోటాపోటీగా సెలవులు పెట్టడం, విధులకు హాజరైన రోజుల్లో కూడా సరిగా వైద్య సేవలు అందించకపోవడంతో మూగ జీవాల ఆరోగ్యం అగమ్యగోచరంలో పడింది. ఇటీవల ఇక్కడ శివంగి(ఆడ సింహం)కి పుట్టిన రెండు పిల్లలు మృత్యువాత పడ్డాయి. జూ పార్కుల్లో సింహాలకు పిల్లలు పుట్టడం దేశంలో ఇదే మొదటిసారి. ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సిన జూ వైద్యులు నిర్లక్ష్యం కారణంగా.. పుట్టిన రెండు సింహం పిల్లల్లో ఒకటి రెండు రోజుల వయసులో, మరొకటి 12 రోజుల వయసులో ప్రాణాలు కోల్పోయాయి. ఏడాదిన్నర క్రితం ఇక్కడ జిరాఫీ పిల్ల తల్లి కడుపులోనే మరణించిన విషయం తెలిసిందే. ఇతర దేశాల నుంచి ఇక్కడకు తీసుకువచ్చిన పలు అరుదైన వన్యప్రాణులు సైతం సరైన వైద్యం అందకపోవంతో మృత్యువాత పడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లాంగ్ లీవ్‌లో డాక్టర్ శ్రీనివాస్

జూ పార్కు ఏర్పాటైనప్పటి నుంచి పశు సంవర్ధక శాఖకు చెందిన డాక్టర్ శ్రీనివాస్ ఇక్కడి మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆయన వ్యక్తిగత కారణాలతో రెండేళ్ల క్రితం లాంగ్(ఐదేళ్ల) లీవ్ పెట్టారు. అప్పటి నుంచి పరిస్థితులు దిగజారాయి. ప్రస్తుతం ఇక్కడ ముగ్గురు వైద్యులున్నారు. వారిలో నెల క్రితం నియమించిన పశు సంవర్ధక శాఖకు చెందిన ప్రభుత్వ వైద్యుడున్నారు. మిగిలిన ఇద్దరు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వారిలో ఒక యువ వైద్యుడు ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. ఆయనకు హైదరాబాద్‌లో సొంతంగా వెటర్నరీ మందుల సంస్థ ఉంది. ఆ సంస్థ నుంచే గతంలో అవసరానికి మించి మందులు కొనుగోలు చేయించేవారని సమాచారం. సదరు వైద్యుడు నెలలో సగం రోజులు సిక్ లీవ్‌ల పేరిట జూ డ్యూటీకి ఎగనామం పెడుతున్నారు. మరో మహిళా వైద్యురాలు నాలుగు నెలల క్రితం జూలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో చేరారు. ఆమె గతంలో కొన్నాళ్లు ఇక్కడ వైద్యురాలిగా పనిచేశారు. ఇక్కడ మానేసిన తర్వాత జీవీఎంసీ మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లో చేరారు. ప్రస్తుతం ఆమె రెండు ఉద్యోగాలు చేస్తున్నట్లు జూ సిబ్బంది చెప్తున్నారు. అక్కడో వారం.. ఇక్కడో వారం అన్నట్లుగా ఆమె సేవలందిస్తున్నట్లు తెలిసింది. వీరిద్దరు డ్యూటీకి వెళ్లిన రోజుల్లో కూడా వన్యప్రాణులను సరిగా పరిశీలించట్లేదని యానిమల్ కీపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి నిర్లక్ష్యం కారణంగానే గర్భం దాల్చిన సింహానికి సరైన వైద్యం, అవసరమైన మందులు అందక నీరసించిన పిల్లలు పుట్టాయన్న ఆరోపణలున్నాయి. వీరిద్దరు ఇటీవల నియమించిన ప్రభుత్వ వెటర్నరీ వైద్యుడికి కూడా సహకరించకుండా సెలవుల్లో గడుపుతున్నారని సమాచారం. ఇంత జరుగుతున్నా అటవీశాఖ సీఎఫ్, జూ ఉన్నతాధికారులు సర్దుబాటు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

సరికొత్త హంగులతో వైఎస్సార్ స్టేడియం


ఆధునికీకరించిన ఆటగాళ్ల గ్రీన్‌రూమ్


స్టేడియం లోపల సుందరీకరణ పనులు

విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌కు విశాఖలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం సిద్ధమవుతోంది. మరో సారి ఢిల్లీ క్యాపిటల్స్ సెకండ్ హోం గ్రౌండ్‌గా విశాఖ స్టేడియాన్ని ఎంచుకోవడమే కాకుండా తొలి మ్యాచ్‌ను ఇక్కడే ఆడి సీజన్‌కు శ్రీకారం చుట్టనుంది. 27,251 మంది అభిమానులు ప్రత్యక్షంగా మ్యాచ్‌ను వీక్షించే అవకాశం ఉన్న వైఎస్సార్ స్టేడియంలో డీసీ తొలి మ్యాచ్ లక్నో సూపర్ జెయింట్స్‌తో 24వ తేదీ రాత్రి ఏడున్నర గంటలకు ఆడనుంది. అలాగే ఈ నెల 30వ తేదీ ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం మూడున్నరకే ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌ల నిర్వహణకు వీలుగా స్టేడియంలో ఆధునిక హంగులు సమకూరుస్తున్నారు. ఆటగాళ్ల గ్రీన్‌రూమ్స్‌తో సహా డగౌట్స్‌ను ఆధునికీకరించారు. మ్యాచ్‌ల్లో డ్రెస్సింగ్ రూమ్‌కి చాలా ప్రాధాన్యం ఉన్నా.. టీ–20లో ఆటగాళ్లు కూర్చునేందుకు మైదానానికి ఇరువైపులా ఉండే డగౌట్స్ ప్రత్యేకతను సంతరించుకుంటాయి. డీసీ మేనేజ్‌మెంట్ సూచనల మేరకు ఏసీఏ ప్రత్యేక దృష్టి పెట్టి సాధారణ ప్రేక్షకులతో పాటు కార్పొరేట్‌కు పెద్దపీట వేసింది. అందుకు అనువుగా 34 వీఐపీ కార్పొరేట్ బాక్స్‌లతో పాటు రెండు టీమ్ బాక్స్‌లను ఆధునికీకరించింది. ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్‌తో సహా నాలుగు లిఫ్ట్‌ల్లో ఒకేసారి 64 మంది వెళ్లే విధంగా తీర్చిదిద్దింది. దాదాపు రూ.40 కోట్ల వరకు వెచ్చించి స్టేడియంలో సౌకర్యవంతమైన సీటింగ్ ఏర్పాట్లతో పాటు అభిమానులకు బాత్‌రూమ్‌లను సైతం మూడింతలు పెంచి సౌకర్యాలు కల్పించింది. స్టేడియంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి 14 ఏళ్లు దాటిపోవడంతో.. వాటి స్థానంలో రూ.9.5 కోట్లు వెచ్చించి ఆధునిక టెక్నాలజీతో పూర్తి నైట్ మ్యాచ్‌కు అనువుగా ఆధునికీకరించింది. పెవిలియన్ ఎండ్ సౌత్ బ్లాక్‌లో ఆటగాళ్ల రూమ్, డగౌట్‌కు పైన 1,640 మంది కూర్చునే కార్పొరేట్ బాక్స్‌లు అన్ని హంగులతో సిద్ధమయ్యాయి. ఆటగాళ్లకు దగ్గరగా ఉండే అప్పర్ వెస్ట్, జి, ఐ స్టాండ్స్‌లోనూ సిట్టింగ్ ఏర్పాట్లను మెరుగుపరిచారు. స్టేడియంలో మొత్తంగా కార్పొరేట్ బాక్స్‌లతో సహా 22 స్టాండ్స్ ఉన్నాయి. ఈ రెండు మ్యాచ్‌లకు టికెట్లను త్వరలో ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



• సాగరతీరంలో ఎడారి ఓడ

ఎడారి ఓడ ఒంటె విశాఖపట్నం తీరంలో నందడి చేసింది. చిన్నారులు ఉత్సాహంగా ఒంటెపై ఎక్కి.. ఇసుక తిన్నెలపై విహరిస్తూ మంచి అనుభూతిని పొందారు. మంగళవారం సాయం సంధ్యా వేళ ఈ సుందర దృశ్యం చూపరులను కట్టిపడేసింది.

–ఏయూక్యాంపస్/ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఇద్దరిపై కూలిన విద్యుత్ స్తంభం

- విశాఖ డెయిరీ జంక్షన్ వద్ద వేచి ఉండగా ఘటన
- ఒకరి పరిస్థితి విషమం


గాయాలపాలైన సత్యవతి


అపస్మారక స్థితిలో కామేశ్వరరావు


కూలిన విద్యుత్ స్తంభం

అక్కిరెడ్డిపాలెం: ప్రమాదం ఎప్పుడు, ఎలా వస్తుందో చెప్పలేం. కొన్నిసార్లు మన ప్రమేయం లేకున్నా ఆ ప్రమాదానికి బాధితులం అవుతాం. మంగళవారం విశాఖ డెయిరీ జంక్షన్‌లో వేచి ఉన్న ఇద్దరిపై విద్యుత్ స్తంభం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను మార్చడంలో అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షులు, గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివి..

జాతీయ రహదారిపై తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలు కూలుతున్నా.. జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల కిందట విశాఖ డెయిరీ జంక్షన్‌లో విద్యుత్ స్తంభం కూలిపోగా, అక్కడే విధుల్లో ఉన్న కమ్యూనిటీ గార్డు ఈ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. తాజాగా మరో స్తంభం కూలి ఇద్దరిపై పడిపోయింది. మంగళవారం మధ్యాహ్నం ఆటోనగర్ నుంచి షీలానగర్ వైపు ఆర్టీసీ బస్సు వస్తోంది. విశాఖ డెయిరీ ఎదురుగా జంక్షన్ వద్దకు వచ్చేసరికి జీవీఎంసీ విద్యుత్ స్తంభం నుంచి వెళ్తున్న తీగ బస్సు టాప్‌కు తగలడంతో ఇరుక్కుపోగా, బస్సు లాక్కొని పోయింది. దీంతో తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం విరిగి నేలకొరిగింది. అదే సమయంలో బెల్ ప్రవేశ గేటు వైపు నుంచి విశాఖ డెయిరీ వైపు రోడ్డు దాటడానికి బైక్‌పై వేచి ఉన్న బొత్స కామేశ్వరరావు, పక్కనే నిల్చొని ఉన్న దొడ్డి సత్యవతిపై ఆ విద్యుత్ స్తంభం పడింది. తీవ్ర గాయాల పాలైన కామేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. సత్యవతికి తలకు తీవ్ర గాయం కావడంతో షీలానగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. కె.కోటపాడు, వారాడ సంతపాలేనికి చెందిన కామేశ్వరరావుకు విశాఖ డెయిరీలో పని కుదిరింది. మొదటి రోజు పనికి వెళ్లేందుకు వచ్చి ఇలా ప్రమాదానికి గురికావడం పలువురిని తీవ్రంగా కలచివేసింది. తల్లితో కలిసి అతను నివసిస్తున్నట్లు బంధువులు తెలిపారు. 69వ వార్డు నాతయ్యపాలేనికి చెందిన సత్యవతి అనకాపల్లిలో ఉంటున్న తన కుమార్తెను చూడటానికి వెళ్లేందుకు పళ్లు కొనుగోలు చేసింది. అనంతరం విశాఖ డెయిరీ వైపు రోడ్డు దాటడానికి వేచి ఉండగా ప్రమాదానికి గురైంది. కాగా.. జరిగిన ప్రమాదం ట్రాఫిక్ పరిధిలోకి వస్తుందా లేదా లా అండ్ ఆర్డర్ పరిధిలోకి వస్తుందా అనే సందిగ్ధతతో పోలీసులు సాయంత్రం వరకు కేసు నమోదు చేయలేదు.

మలేసియాలో ఉన్న భర్తను రక్షించాలని వేడుకోలు

ఫోర్త్‌టౌన్ పోలీసులకు భార్య ఫిర్యాదు

సీతమ్మధార: తమ బంధువులు తన భర్తను ఉద్యోగం పేరుతో మలేసియా తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేస్తున్నారని, ఆయన్ని సురక్షితంగా తన దరికి చేర్చాలని ఒక మహిళ ఫోర్త్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె తెలిపిన వివరాలివి.. అక్కయ్యపాలేనికి చెందిన వగల రాజేశ్వరి భర్త సూర్యనారాయణ క్రేన్ ఆపరేటర్. ఆయన పిన్ని కొడుకు వగల వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు ఎనిమిదేళ్ల కిందట నెలకు రూ.60 వేల వేతనం ఇస్తారని చెప్పి.. సూర్యనారాయణకు పాస్‌పోర్టు తయారు చేయించి మలేసియా పంపించారు. అయితే ఆ వేతనం రాజేశ్వరికి చేరకుండా వెంకటేశ్వరరావు తన భార్య వగల సుజాతకు పంపించేలా ఏర్పాటు చేసుకున్నాడు. కాగా.. సూర్యనారాయణ ఇటీవల రాజేశ్వరికి ఫోన్ చేసి, తనకు చెప్పిన ఉద్యోగం కాకుండా వేరే పనులు చేయిస్తున్నారని వాపోయాడు. దీంతో ఆమె సీపీ శంఖబ్రత బాగ్చిని ఆశ్రయించి, తన భర్తను సురక్షితంగా తీసుకురావాలని వేడుకుంది. సీపీ సూచనల మేరకు మంగళవారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదును పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

• వీఎంఆర్డీఏ పార్కుకు నూతన శోభ





వీఎంఆర్డీఏ పార్కు చిన్నారుల హృదయాలను దోచుకుంటోంది. బీచ్‌రోడ్డులో ఆహ్లాదకరమైన వాతావరణంలో తీర్చిదిద్దిన ఈ పార్క్‌లో సరికొత్త ఆకర్షణలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ముఖ్యంగా పార్క్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆకుపచ్చని ఏనుగుల బొమ్మలు, తల్లీబిడ్డల శిల్పం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకమైన, పర్యావరణ అనుకూల మెటీరియల్‌తో తయారు చేసిన ఈ శిల్పాలు.. పార్క్‌లోని పచ్చిక బయళ్ల మధ్య, వివిధ రకాల మొక్కల నడుమ సుందరంగా కనిపిస్తున్నాయి. దూరం నుంచి చూస్తే.. అవి పచ్చదనంతో నిండిన మొక్కలతో కలిసిపోయి, సహజసిద్ధమైన దృశ్య అనుభూతిని కలిగిస్తున్నాయి. ప్రత్యేకించి బిడ్డను ఎత్తుకొని లాలిస్తున్న తల్లి శిల్పం అత్యంత సహజంగా.. భావోద్వేగాలను రేకెత్తించే విధంగా ఉంది. పార్క్‌ను సందర్శించే ప్రజలు.. వీటితో సెల్ఫీలు దిగుతున్నారు. ఏనుగుల బొమ్మల చుట్టూ రక్షణ కంచెను ఏర్పాటు చేశారు. ఈ కొత్త ఆకర్షణలు వీఎంఆర్డీఏ పార్క్‌కు ప్రత్యేక శోభను తీసుకురావడమే కాకుండా.. సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - ఏయూక్యాంపస్

చాపల్లో గంజాయి రవాణా

విశాఖ రైల్వే స్టేషన్‌లో నిందితుల అరెస్ట్


రైల్వేస్టేషన్లో అదుపులోకి తీసుకున్న గంజాయి నిందితులతో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం: గంజాయి రవాణాకు నిందితులు కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. తాజాగా చాపల్లో చుట్టి గంజాయిని రవాణా చేస్తుండగా విశాఖపట్నం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి.. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తన సిబ్బందితో కలిసి మంగళవారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై పశ్చిమ బెంగాల్‌కు చెందిన మాన్‌సింగ్ ఘోష్, కృష్ణపాల్‌లను తనిఖీ చేయగా.. వారి వద్ద గంజాయి లభించింది. వారు ఎవరికీ అనుమానం రాకుండా ప్లాస్టిక్ చాపల్లో గంజాయిని కట్టలుగా కట్టి తీసుకువెళ్తున్నారు. ఒడిశాలోని పాడువా నుంచి ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాకు గంజాయిని రవాణా చేస్తుండగా దొరికిపోయారు. వారి వద్ద నుంచి రూ.89,500 విలువైన 17.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని.. ఇద్దరినీ జీఆర్పీ ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించారు. పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు.


విశాఖ-బెంగళూరు స్పెషల్‌కు జోలర్‌పేట్‌లో హాల్ట్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–ఎస్ఎంవీ బెంగళూరు–విశాఖపట్నం మధ్య నడుస్తున్న వీక్లీ స్పెషల్ రైలుకు జోలర్‌పేట్‌లో అదనపు హాల్ట్ కల్పిస్తున్నట్లు సందీప్ తెలిపారు.

• విశాఖపట్నం–ఎస్ఎంవీ బెంగళూరు(08549) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16 నుంచి, తిరుగు ప్రయాణంలో బయల్దేరే ఎస్ఎంవీ బెంగళూరు–విశాఖపట్నం(08550) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 17 నుంచి జోలర్‌పేట్‌లో హాల్ట్ కల్పించారు.

విశాఖను స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానంలో నిలపాలి

జీవీఎంసీ అధికారులతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్


మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

డాబాగార్డెన్స్: స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్రపై ప్రజలకు అవగాహన కలిస్తూ వారిని భాగస్వామ్యం చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జీవీఎంసీ కార్పొరేటర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే 4వ పరిశుభ్ర నగరంగా ఉన్న విశాఖను స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం టౌన్‌కొత్తరోడ్డులోని సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, ల్యాబ్‌ను పరిశీలించి శుద్ధి చేసిన నీటిని తనిఖీ చేశారు. కాపులుప్పాడ డంపింగ్ యార్డ్, జిందాల్ పవర్ ప్లాంట్‌ను పరిశీలించారు. కార్పొరేటర్లు పీలా శ్రీను, గంకల కవిత, భీశెట్టి వసంతలక్ష్మి పాల్గొన్నారు.



ప్రమాదకర సవారీ

ఇది ద్విచక్ర వాహనం.. ఇద్దరికి మాత్రమే అనుకూలం. కానీ కొందరు కుర్రాళ్లు స్కూటీని 'సఫారీ'లా ఫీలై నగర వీధుల్లో దూసుకుపోతున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు, ఏకంగా ఐదుగురు ఒకే స్కూటీపై నిబంధనలకు విరుద్ధంగా, హెల్మెట్ కూడా లేకుండా కోస్టల్ బ్యాటరీ సమీపంలో విహరిస్తున్నారు. ఇలాంటి విన్యాసాలు వారి ప్రాణాలకే కాకుండా, ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదకరమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	: రూ.78
బ్రాయిలర్ (లైవ్)	: రూ.98
స్కిన్	: రూ.166
స్కిన్‌లెస్	: రూ.176